క్లుప్తంగా

బీటీ రోడ్డు పనులు ప్రారంభం

చిల్పూరు: మండలంలోని లింగంపల్లి పంచాయతీ పరిధిలోని దేవోజీతండాకు రూ.కోటి విలువైన బీటీ రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ ఏదునూరి రవీందర్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీగా, ప్రస్తుత ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఉన్న సమయంలో లింగంపల్లి–ఫత్తేపూర్ బీటీ రోడ్డు నుంచి కిలోమీటరు దూరంలో ఉన్న తండాకు బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారన్నారు. సమావేశంలో ఉప సర్పంచ్ కంకటి రాజన్న, ఎంపీటీసీ కంకటి రవి, నాయకులు సుదర్శన్, యాదగిరి, సంపత్‌రెడ్డి, రవీందర్, రవి, సత్తయ్య, కనుకయ్య, పాల్గొన్నారు.

సర్పంచ్‌కు సన్మానం

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని శివునిపల్లికి చెందిన 8వ వార్డు సభ్యుడు బూర్ల విష్ణు ఇటీవల గ్రామ తాత్కాలిక సర్పంచ్‌గా బాధ్యతలు స్వీకరించగా శుక్రవారం వార్డుకు చెందిన ప్రజలు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో తోట భిక్షపతి, వెంకటేశ్వర్లు, రవి, కుమారస్వామి, వెంకన్న, యాదగిరి, నర్సింహులు, సురేందర్, రమేష్, మహేందర్, రమేష్, శివ, రాజేష్, అఖిల్, రాకేష్ పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించాలి

బచ్చన్నపేట : గ్రామాల అభివృద్ధికి గ్రామస్తులు అందరూ సహకరించాలని ఆలింపూర్ సర్పంచ్ నరెడ్ల బాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం గ్రామంలోని జీపీ కార్యాలయంలో గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తులు అందరూ ఇంటి, నల్లా పన్నులను సకాలంలో చెల్లించాలని ఆ డబ్బులతో గ్రామాభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి రేవతి, వార్డు సభ్యులు, అంగన్‌వాడీలు, గ్రామస్తులు పలువురు పాల్గొన్నారు.

నేటి నుంచి ధనుర్మాస ఉత్సవాలు

చిల్పూరు : చిల్పూరుగుట్ట శ్రీబుగులు వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం నుంచి జనవరి 13 వరకు ధనుర్మాస ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ భాగం లక్ష్మిప్రసన్న తెలిపారు. ఆలయ ప్రాంగణంలో శుక్రవారం ఆలయ అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యులతో కలిసి మాట్లాడారు. ఇక నుంచి ధనుర్మాసం (మార్గళిమాసం) శనివారం నుంచి ప్రారంభం అవుతున్నందున స్వామి వారి వారకల్యాణం ఉండదన్నారు. జనవరి 13న గోదాకల్యాణంతో ప్రారంభవుతుందని అన్నారు. ధనుర్మాస సేవా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొనాలని కోరారు.

కడియంను కలిసిన బీఆర్‌ఎస్ నాయకులు



జఫర్‌గఢ్: ఎమ్మెల్యేగా అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేసిన కడియం శ్రీహరిని మండలానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే కార్టర్స్‌లో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కడియం శ్రీహరికి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు అన్నం బ్రహ్మారెడ్డి, ఎంపీపీ రడపాక సుదర్శన్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుజ్జరి రాజు, సింగిల్ విండో చైర్మన్ తీగల కర్ణాకర్‌రావు, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు ఎడ్ల వెంకటస్వామి, బానోత్ రాజేష్‌నాయక్, మారపల్లి ప్రభాకర్, ఇల్లందుల శ్రీనివాస్, జ్యోతి యాకయ్య, కడారి శంకర్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఉన్నారు.

కడియంను కలిసిన శ్రీధర్‌రావు

చిల్పూరు: స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యేగా గురువారం అసెంబ్లీలో కడియం శ్రీహరి ప్రమాణ స్వీకారం చేయగా శుక్రవారం చిల్పూరుగుట్ట అభివృద్ధి కమిటీ చైర్మన్, ఆలయ శాశ్వత దాత పొట్లపల్లి శ్రీధర్‌రావు హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో మర్యాద పూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్ఛం అందజేశారు. గుట్ట అభివృద్ధి నిధులను మంజూరయ్యేలా చూడాలని కోరారు. దయాకర్, నర్సింహారావు ఉన్నారు.

ఎమ్మెల్యే యశస్విని కలిసిన ల్యాబ్స్ ఎండీ

పాలకుర్తి: స్థానిక ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీ రెడ్డిని మండలంలోని వావిలాలకు చెందిన రాజధాని ల్యాబ్స్ ఎం.డి అనపర్తి రాజ్‌కుమార్ కలిశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఝాన్సీరెడ్డి నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. తాళ్లపల్లి దేవన్న, యాసారపు కృష్ణ ఉన్నారు.

సమ్మేళనంలో పాల్గొన్న ధోరణి మ్యాక్స్ సభ్యులు

జనగామ రూరల్: హైదరాబాద్‌లో కన్హా కన్వెన్షన్‌లో జరుగుతున్న 3వ అఖిల భారత సహకార మహిళా సమ్మేళనానికి జనగామ నుంచి ధోరణి మహిళా మ్యాక్స్ 15 మంది సభ్యులు శుక్రవారం తరలివెళ్లారు. సీఈవో సత్యం, మేనేజర్ బాలమణి, శ్రీనివాస్ ఉన్నారు.

‘మహాలక్ష్మి’పై మండిపడిన ఆటోడ్రైవర్లు

- ర్యాలీ, ధర్నా, రాస్తారోకో
- సీఎం డౌన్‌డౌన్ అంటూ నినాదాలు



స్టేషన్‌ఘన్‌పూర్ : జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న ఆటో కార్మికులు

స్టేషన్‌ఘన్‌పూర్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచితంగా ఆర్టీసీ బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తూ చేపట్టిన మహాలక్ష్మి పథకంపై ఆటో కార్మికులు భగ్గుమన్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఘన్‌పూర్, చిల్పూరు ఉమ్మడి మండలాలకు చెందిన ఆటో డ్రైవర్లు ఘన్‌పూర్‌లో శుక్రవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ముందుగా స్థానిక పాత గాంధీ చౌరస్తా నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం జాతీయ రహదారిపై కాసేపు రాస్తారోకో చేశారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి రాష్ట్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్ల యూనియన్ ఘన్‌పూర్ మండల అధ్యక్షుడు రాజారపు జయపాల్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వస్తుంది, ఏమో చేస్తుందని ప్రజలు ఆశిస్తే ఆటో కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మా కుటుంబాలు గడవడం కష్టంగా ఉందన్నారు. సీఎం స్పందించి మహాలక్ష్మీ పథకాన్ని రద్దు చేసి ఆటో కార్మికులను ఆదుకోవాలని, ఆటోడ్రైవర్ల సంక్షేమానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, లేనిపక్షంలో మాకు ఆత్మహత్యలే శరణ్యమన్నారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్ల యూ నియన్ నాయకులు గుర్రం మధు, తాళ్లపెల్లి గంగరాజు, ఎడ్ల ఎల్లయ్య, అశోక్, చింత యాదగిరి, కిషన్, వేణు, పాలకొండ మోహన్, చింత జగదీష్, సమ్మయ్య, కుమార్, అన్వర్, శాగ శ్రీను, మొగిలి, మహేందర్, భీమయ్య పాల్గొన్నారు.

‘మహాలక్ష్మి’తో మా పొట్టలు కొట్టారు



చిల్పూరు : మాట్లాడుతున్న భీమయ్య

చిల్పూరు: మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పేరుతో ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంతో కాంగ్రెస్ ప్రభుత్వం మా పొట్టలు కొట్టారని ఆటో యూనియన్ అధ్యక్షుడు సాదం భీమయ్య ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని కృష్ణాజీగూడెంలో శుక్రవారం ఆటో కార్మికులతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ రోజు రెండు ట్రిప్పులు ప్యాసింజర్లను ఎక్కించుకుని ఆటోలు నడిపే వారమని ఎక్కువగా మహిళలు ఎక్కేవారు. దీంతో అన్ని ఖర్చులు పోను తమ కుటుంబానికి సరిపోయేవన్నారు. కుటుంబ పోషణ కోసం అప్పులు చేయాల్సిన దుస్థితి తమకు కల్పించారని అన్నారు. ప్రభుత్వం పునరాలోచించుకుని కార్మికులను ఆదుకోవాలన్నారు.

ప్రభుత్వాన్ని కూలుస్తామనడం సిగ్గుచేటు



మాట్లాడుతున్న తక్కెళ్లపల్లి శ్రీనివాస్‌రావు

జనగామ రూరల్ : నియంతృత్వ రాచరిక పాలనను తెలంగాణ ప్రజలు ఓడించి కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడం చూసి భరించలేక బీఆర్‌ఎస్ నాయకులు ప్రభుత్వాన్ని కూల్చుతామనడం సిగ్గుచేటని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తక్కెళ్లపల్లి శ్రీనివాస్‌రావు అన్నారు. శుక్రవారం సీపీఐ జిల్లా పార్టీ కార్యాలయంలో పాతూరి సుగుణమ్మ అధ్యక్షతన జిల్లా సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రాన్ని అప్పుల కుంపటిలో ముంచడమే కాకుండా అవినీతిలో నిండామునిగిన నాయకులు నేడు విమర్శించడం సరికాదన్నారు. సహనం కోల్పోకుండా ప్రజల దృష్టిలో గౌరవంగా ఉండాలని హితువు పలికారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రాజారెడ్డి, శ్రీనివాస్, ఆదిసాయన్న, జనార్దన్, సదానందం, సోమయ్య, రమేష్, మల్లయ్య, మధు, విజయ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకుల వద్ద సెక్యూరిటీ ఏర్పాటు చేయాలి

- ఘన్‌పూర్ ఏసీపీ శ్రీనివాసరావు

స్టేషన్‌ఘన్‌పూర్: బ్యాంకులు, ఏటీఎం సెంటర్ల వద్ద సరైన సెక్యూరిటీ, సీసీ కెమెరాల నిఘా ఏర్పాటు చేయాలని ఘన్‌పూర్ ఏసీపీ శ్రీనివాసరావు అన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్, చిల్పూరు, రఘునాథపల్లి, లింగాలఘణపురం మండలాల పరిధిలోని బ్యాంకులకు చెందిన మేనేజర్లతో స్థానిక ఏసీపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల బ్యాంకుల వద్ద, ఏటీఎం సెంటర్ల వద్ద దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో మేనేజర్లు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏమైనా సమస్య ఉంటే తక్షణమే పోలీసులకు సమాచారం ఇవ్వాలని చెప్పారు. బ్యాంకులకు వచ్చే ఖాతాదారులు సైతం అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో రఘునాథపల్లి సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఘన్‌పూర్ ఎస్‌ఐ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

‘ఎవరూ ఆత్మహత్యకు పాల్పడొద్దు’

స్టేషన్‌ఘన్‌పూర్: మానవజన్మ ఎంతో అద్భుతమని, జీవితం జీవించడానికేనని, కష్టాలు ఎదురైనప్పుడు ధైర్యంగా ఎదుర్కోవాలని, ఎవ్వరూ అధైర్యంతో ఆత్మహత్యలకు పాల్పడవద్దని ఆత్మహత్యల నివారణ కమిటీ చైర్మన్, సైకాలజిస్టు డాక్టర్ పరికిపండ్ల అశోక్ అన్నారు. డివిజన్ కేంద్రంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు బొజ్జపల్లి సుభాష్ ఆధ్వర్యంలో ఆత్మహత్యల నివారణపై అవగాహన సదస్సును శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మహత్య ప్రయత్నం చేసుకునే వ్యక్తులపై సమాజం స్వాంతన చేకూర్చి మానసిక ధైర్యాన్ని నింపాలన్నారు. ఆరోగ్యమిత్ర స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సహజ, మాజీ జెడ్పీటీసీ బలరాములు, బీజేపీ నాయకులు విజయరావు, పాల్గొన్నారు.

‘ఆవోపా’ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు వర్ధంతి



స్టేషన్‌ఘన్‌పూర్ : పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేస్తున్న కమల్‌కుమార్

జనగామ రూరల్ : పొట్టి శ్రీరాములు 72వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం పట్టణ ఆవోపా కార్యాలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వర్ధంతి సభ నిర్వహించారు. పొట్టిశ్రీరాముల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సంఘం అధ్యక్షుడు అరుగుల శ్రీనివాస్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో కౌన్సిలర్ హరిశ్చంద్ర గుప్త పాల్గొని మాట్లాడుతూ తెలుగు వారికి జరుగుతున్న అవమానాలు భరించలేక తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం ఉండాలని 58రోజులు ఆమరణ దీక్ష చేసి అమరుడయ్యారని అన్నారు. కార్యక్రమంలో పట్టూరి జయహరి, గట్టు వెంకటేశ్వర్లు, జైన రమేష్, ఉపేందర్, రాధాకిషన్, శివరామకృష్ణ, వీరేశం, ప్రసాద్, శ్రీను, లక్ష్మణ్, కిరణ్ పాల్గొన్నారు.

తరిగొప్పుల: స్థానిక ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పొట్టిశ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జిడిగం భిక్షపతి, కోశాధికారి శివశంకర్, గ్రామశాఖ అధ్యక్షుడు లక్ష్మినారాయణ, ఉపాధ్యక్షుడు మాశెట్టి వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్: శివునిపల్లిలో జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు పార్శి కమల్‌కుమార్ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. ఆర్యవైశ్య మహాసభ నాయకులు బుచ్చిబాబు, వెంకట్రామనర్సయ్య, శ్రీనివాస్, వెంకన్న, సతీష్, లక్ష్మీనారాయణ, రామక్రిష్ణ, శ్రీని వాస్, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సురేఖను కలిసిన ఉద్యోగ జేఏసీ నాయకులు



పాలకుర్తి: దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రిగా సమస్యలు పరిష్కరిస్తానని మంత్రి కొండా సురేఖ అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో తెలంగాణ అర్చక ఉద్యోగ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ డీ.వీ.ఆర్.శర్మ ఆధ్వర్యంలో కలిశారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యోగ సంఘం అధ్యక్షుడు బేతి రంగారెడ్డి, ప్రధాన కార్యదర్శులు ఆనంద్ శర్మ, శ్యామ్ గౌడలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ నెల 17న బాధ్యతలు తీసుకుంటానని మంత్రి అన్నారు. ఆలయ అర్చకులు, స్వామి వారి ప్రసాదాలు శేషవస్త్రాలు అందజేసి వేద పండితులు ఆశీర్వాదం అందజేశారు. మంత్రిని కలిసిన వారిలో రాష్ట్ర ఉపాధ్యక్షులు టక్కర్స్ సత్యం, ఏడుపాయల శ్రీనివాస్, కార్యదర్శులు సురేందర్, శ్రీధర్ రెడ్డి, రమణ శర్మ, పార్థీవశర్మ, అర్చక ఉద్యోగులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న డివైడర్ రోడ్డు పనులు

దేవరుప్పుల : బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా కొనసాగిన ఎర్రబెల్లి దయాకర్‌రావు కన్‌స్ట్రక్షన్ ఆఫ్ రూరల్ రోడ్డు పద్దు కింద రూ. 11.78 కోట్ల నిధులతో మంజూరు చేయించిన డివైడర్ రోడ్డు పనులు చురుకుగా కొనసాగుతున్నాయి. మండల కేంద్రంలోని జనగామ–సూర్యాపేట రహదారి చౌరస్తా నుంచి కొత్త కాలనీ గంగదేవి ఆలయం వరకు రోడ్డు, డివైడర్‌తో కూడిన సెంట్రల్ లైటింగ్, డ్రెయినేజీ వంటి పటిష్టమైన మౌలిక వసతులతో పనులు చేపట్టనున్నారు. ఈ రోడ్డు పనులు పూర్తయితే ఇరువైపుల సుమారు కిలోమీటరన్నర వరకు గృహనిర్మాణాలు విస్తరించనున్నాయి. ఈ రోడ్డు గుండా యాదాద్రి భువనగిరి జిల్లా పరిధి మోత్కూరు, గుండాల ప్రాంత వాసులకు పాలకుర్తితో పాటు వానకొండయ్య గుట్ట మీదుగా ఈరెంటి(పాలకుర్తి) గూడూరు వయాతో హనుమకొండకు తక్కువ దూరంతో రాకపోకలు మెరుగయ్యే అవకాశాలు ఉన్నాయి.

కంటి వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



కంటి శిబిరాన్ని పరిశీలిస్తున్న క్లబ్ ప్రతినిధులు

దేవరుప్పుల : ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఈదునూరి నర్సింహారెడ్డి(ఈఎన్‌ఆర్) సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో హనుమకొండ శరత్ మాక్స్‌విజన్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రముఖ వైద్యులు శరత్ సౌజన్యంతో కంటి శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచిత వైద్య చికిత్సలు చేసి అవసరార్థులకు ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తారన్నారు. ఇకపై ప్రతి శనివారం అంగడి సమీపంలోని లయన్స్ భవన్‌లో శిబిరాన్ని కొనసాగించేలా చర్యలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు ఉప్పల్‌రెడ్డి, దీప్, గోపయ్య, అశోక్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి పడిపూజ



పడిపూజ నిర్వహిస్తున్న గురుస్వాములు, భక్తులు

స్టేషన్‌ఘన్‌పూర్: హరిహర సుతుడైన అయ్యస్వామి పడిపూజ మహోత్సవాన్ని మండలంలోని పాంనూర్‌లో అఖిలభారతీయ అయ్యప్ప ధర్మ ప్రచారసభ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, గురుస్వామి ఇనుగాల యుగేందర్‌రెడ్డి, అయ్యప్ప భక్తులు ఇనుగాల కార్తీక్ రెడ్డి, గాయత్రీ, గణేష్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. యుగేందర్‌రెడ్డి నివాసంలో చేపట్టిన పడిపూజ మహోత్సవంలో ముందుగా భక్తులు, మాలాధారణ చేసిన స్వాములు మణికంఠుడిని స్తుతిస్తూ స్వాములు భజనలు చేశారు. కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, గురుస్వాములు శ్రీరామ్‌శర్మ, సుభాష్, రాకేష్‌రెడ్డి, బలరాములు, సత్తిరెడ్డి, బీరయ్య, వేణు, కిషోర్‌కుమార్, మల్లమ్మ, రవి, రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

శబరిమలకు తరలిన అయ్యప్ప భక్తులు

జనగామ రూరల్ : మండలంలోని సిద్దెంకి గ్రామంలో అయ్యప్ప భక్తులు మకరజ్యోతి దర్శనానికి శబరిమలకు శుక్రవారం పుచ్చా నరసింహామూర్తి చేతుల మీదుగా ఇరుమడి కట్టుకొని పయనమయ్యారు. ఈఏడాదితో 34వ సారి శబరిమలకు వెళ్తున్నట్లు భక్తులు తెలిపారు.శబరిమలకు వెళ్లిన వారిలో మనోజ్‌స్వామి, గుండా సుమంత్ స్వామి, సెల్ రాజ్ స్వామి, రమేష్ స్వామి ఉన్నారు.

యశస్వినిరెడ్డి గెలుపుతో దుర్గామాతకు మొక్కులు

దేవరుప్పుల : మండలంలోని సీతారాంపురంలో ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి గెలుపు ఆకాంక్ష నెరవేరినందుకు దుర్గామాత అమ్మవారికి కాంగ్రెస్ గ్రామ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఎర్పంచ్ రెడ్డిరాజుల రమేష్, మండల పార్టీ అధ్యక్షుడు పెద్ది కృష్ణమూర్తి, గ్రామశాఖ అధ్యక్షుడు వరికెల రతన్, చీమల బీరయ్య, బీసీ సెల్ మండల అధ్యక్షుడు కాడబోయిన గణేష్, మండల యూత్ అధ్యక్షుడు బోనగిరి యాకస్వామి, మాజీ బీసీ సెల్ అధ్యక్షుడు కాడబోయిన వెంకన్న పాల్గొన్నారు.

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి



విత్తనాలు పంపిణీ చేస్తున్న లోడీ డెరెక్టర్ ఇన్నారెడ్డి


తరిగొప్పుల: రసాయన ఎరువులు పూర్తిగా తగ్గించి, సేంద్రియ ఎరువుల ద్వారా పండించిన కూరగాయలు తినడంతో రైతులు, వారి కుటుంబాలు ఆరోగ్యంగా ఉండాలని ఫాదర్ ఇన్నారెడ్డి అన్నారు. లోడీ సాంఘీక సేవా సంస్థ ఆధ్వర్యంలో మానోస్ యూనిదాస్ సహకారంతో సంస్థ డైరెక్టర్ ఇన్నారెడ్డి ఆదేశానుసారం శుక్రవారం మండలంలోని మాన్‌సింగ్‌తండాలో రైతులు కూరగాయల విత్తనాలు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థ పంపిణీ చేస్తున్న కూరగాయల విత్తనాలను రైతులు తమ వ్యవసాయం భూముల్లో 10–20 గుంటల విస్తీర్ణంలో సాగు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ లకావత్ నంద్యానాయక్, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ బాలశౌరి, ఫీల్డ్ కోఆర్డినేటర్ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఇంటర్నెట్ సేవలు అందించేందుకే పీఎం వాణి

రఘునాథపల్లి: సామాన్య ప్రజలకు అత్యంత తక్కువ ధరలకు నాణ్యమైన ఇంటర్నెట్ సేవలు అందించడమే లక్ష్యంగా కేంద్రప్రభుత్వ సౌజన్యంతో ప్రధానమంత్రి వాణి పథకాన్ని ప్రారంభించినట్లు సంస్థ వ్యవస్థాపకుడు సూరజ్‌సింగ్ తెలిపారు. స్థానిక అబ్దుల మియా మీసేవా సెంటర్లో శుక్రవారం పీఎం వాణి పథకాన్ని ప్రారంభించిన సందర్భంగా సూరజ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో సామాన్య ప్రజలకు వేగవంతంగా అతి తక్కువ ధరలో ఇంటర్నెట్ సేవలను ప్రారంభించినట్లు తెలిపారు.

టోల్ ప్లాజా వద్ద నిలిచిన ఆర్టీసీ బస్సులు



రఘునాథపల్లి: నిత్యం హనుమకొండ నుంచి హైదరాబాద్ నడిచే ఆర్టీసీ బస్సులకు ఫాస్టాగ్ పనిచేయక పోవడంతో శుక్రవారం మండల పరిధిలోని కోమళ్ల టోల్‌ప్లాజా వద్ద సిబ్బంది 20 బస్సుల వరకు గంట పాటు నిలిపివేశారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. రోజులాగే ఉదయం ప్రయాణికులను ఎక్కించుకుని బయలు దేరాయి. టోల్ ప్లాజా వద్దకు చేరుకోగానే ఆర్టీసి బస్సులకు సంబంధించిన ఫాస్టాగ్ ఆక్టివేషన్ కాకపోవడంతో శుక్రవారం మొరాయించాయి. దీంతో ప్లాజా సిబ్బంది ఆర్టీసీ బస్సులకు అడ్డంగా ఉండి నిలిపివేశారు. దీంతో డ్రైవర్, కండక్టర్‌తో పాటు ప్రయాణికులు వారితో వాగ్వాదానికి దిగారు. విషయం తెలుసుకున్న జనగామ డీఎం టోల్‌ప్లాజా యజమానులతో మాట్లాడి సమస్య పరిష్కరించడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

చిల్పూరు : మండలంలోని లింగంపల్లిలో నెలకొని ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కాంగ్రెస్ నాయకులు పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జ్ సింగపురం ఇందిరకు విన్నవించారు. శుక్రవారం పార్టీ మండల ఇన్‌చార్జ్ తీగల మహేందర్‌తో కలిసి స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఆమెను మర్యాదపూర్వకంగా కలి శారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణలో రెండో పెద్దజాతరగా చెప్పుకునే లింగంపల్లి సమ్మక్క–సారలమ్మ జాతర దగ్గర పడుతున్నందున భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక నిధులు మంజూరు చేయించాలని అన్నారు. అందుకు స్పందించిన ఇందిర త్వరలో జాతర ప్రాంగణాన్ని సందర్శిస్తానని, గ్రామాభివృద్ధి విషయంలో సంబంధిత మంత్రులకు వివరిస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో గ్రామ శాఖ అధ్యక్షుడు కంకటి నరేందర్, మండల బీసీ సెల్ అధ్యక్షుడు బాలరాజు, యూత్ అధ్యక్షుడు ఊరడి రాజు, జాతర మాజీ చైర్మన్ మోతె శ్రీనివాస్, కందుకూరి రాజా పాల్గొన్నారు.

ఆకట్టుకున్న శ్రీకృష్ణ సత్య నాటకం



చిల్పూరు: మండలంలోని పల్లగుట్టలో నార్కట్‌పల్లికి చెందిన శారద నాట్య మండలి కళాకారులు శ్రీకృష్ణ సత్య పౌరాణిక నాటకాన్ని శుక్రవారం ప్రదర్శించగా ప్రేక్షకులను ఆకట్టుకుంది. తెలుగు అసోసియేషన్ ఆఫ్ మెట్రో అట్లాంటా, తెలంగాణ, అమెరికన్, మైత్రి అసోసియేషన్, టీఆర్ అండ్ ఎన్ ఫౌండేషన్ సౌజన్యంతో శారద విజయ నాట్య మండలి కళాకారులు జామ్ యాప్‌లో పల్లగుట్ట డ్రామా థియేటర్‌లో కారుమంచి సాయిరాం, మద్దాలి సుబ్బారావు, సురేష్ బండారి, మాదాగి భరత్ చిలువేరు విష్ణు, టీఎస్‌రెడ్డి ఆర్థిక సాయంతో నాట్యమండలి అధ్యక్షుడు శివశంకర్, కార్యదర్శి రామ్‌మోహన్ ఆధ్వర్యంలో నాటకాన్ని ప్రదర్శించారు.

ఇద్దరు వ్యక్తుల రిమాండ్

తరిగొప్పుల : రైతులు వద్ద ధాన్యం కొనుగోలు చేసి డబ్బులు ఇవ్వకుండా తప్పించుకు తిరుగుతున్న ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై దూదిమెట్ల నరేష్ తెలిపారు. వరంగల్ జిల్లా నెక్కొండ మండలం రెడ్లవాడకు చెందిన గొలుసు నర్సయ్య యూకే ఆగ్రి సీడ్స్ మేనేజింగ్ డైరెక్టర్‌గా, కరీంనగర్ జిల్లా కేశవపట్నం మండలం కన్నాపూర్ గ్రామానికి నక్కగట్టు సాగర్ ప్రతినిధిగా కొనసాగుతున్నారు. కాగా వీరు తరిగొప్పుల మండలంలోని బొంతగట్టునాగారంలో ఇరుమల్ల కనకరాజును ఏజెంట్‌గా నియమించుకుని సీడ్స్ ప్రాసెసింగ్ పేరుతో గత ఏప్రిల్‌లో గ్రామానికి చెందిన 23 మంది రైతులు వద్ద 100 టన్నులు ధాన్యం కొనుగోలు చేశారు. రైతులకు రూ.22.50 లక్షలు ఇవ్వాల్సి ఉండగా రూ.3.50 లక్షలు అందజేశారు. మిగతా డబ్బును ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేయడంతో ఏజెంట్ ఇరుమల్ల కనకరాజు అక్టోబర్‌లో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో నవంబర్‌లో సాగర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. అప్పటి నుంచి నర్సయ్య పరారీలో ఉన్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు..శుక్రవారం హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకుని పీఎస్‌కు తరలించారు. అనంతరం విచారించగా రైతుల వద్ద కొనుగోలు చేసిన ధాన్యాన్ని సీడ్స్ ప్రాసెసింగ్ చేయకుండా నిబంధనలకు విరుద్ధంగా గీసుకొండ మండలం ధర్మారంలోని శ్రీరాజరాజేశ్వర్ ఇండస్ట్రీస్, జమ్మికుంటలోని శ్రీలక్ష్మీ రైస్ మిల్‌లో విక్రయించానని, ఈ సొమ్మును రైతులకు ఇవ్వలేని నర్సయ్య నేరం ఒప్పుకున్నారు. దీంతో నక్కగట్టు సాగర్, గొలుసు నర్సయ్యపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్సై తెలిపారు. కాగా, గుర్తు తెలియని కంపెనీలకు రైతులు ధాన్యం విక్రయించొద్దని ఎస్సై పేర్కొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



దేవరుప్పుల : మండల కేంద్రంలోని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఉప్పుల యాదగిరి తండ్రి పిచ్చయ్య (సందుల) మృతి చెందగా ఆ కుటుంబాన్ని కాంగ్రెస్ నాయకులు పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. పరామర్శించిన వారిలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కాసారపు ధర్మారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు పెద్ది కృష్ణమూర్తి గౌడ్, గ్రామ కమిటీ అధ్యక్షుడు ఉప్పుల ఉప్పలయ్య, సీనియర్ నాయకులు ఉన్నారు.

బచ్చన్నపేట : మండలంలోని కొన్నె గ్రామానికి చెందిన మినుకూరి బాల్‌రెడ్డి పాడి ఆవు మరణించడంతో ఆ బాధిత రైతు కుటుంబానికి గ్రామ సామాజిక కార్యకర్త, బీఆర్‌ఎస్ నాయకుడు కోడూరి శివకుమార్‌గౌడ్ రూ.5వేల ఆర్థిక సాయాన్ని అందించారు. శుక్రవారం బాధిత రైతు కుటుంబాన్ని పరామర్శించిన అనంతరం మాట్లాడారు. ఆయన వెంట సిద్ది రాములు, మల్లారెడ్డి, రాములు, రమేష్‌రెడ్డి ఉన్నారు.

స్నేహితుడి కుటుంబానికి...



తరిగొప్పుల: ఆర్థిక సాయం అందజేస్తున్న స్నేహితులు

తరిగొప్పుల: మండల కేంద్రానికి చెందిన జల్తారీ రాజు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా 2008–09 పదో తరగతి బ్యాచ్ మిత్రులు కలిసి మృతుడి ఆర్థిక పరిస్థితి తెలుసుకున్నారు. ఆ కుటుంబానికి సాయం చేయాలనే సంకల్పంతో రూ.20 వేలు సేకరించి నగదును బాధిత కుటుంబ సభ్యులకు శుక్రవారం అందజేశారు. అందజేసిన వారిలో వేణు, బాలు, రామకృష్ణ, కుమార్, శ్రీనివాస్, సాంబరాజు, రాజు జానీ, శ్రీనివాస్, తిరుపతి, కనకరాజు, రవి, నరేష్, లావుడ్య ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

బచ్చన్నపేట : రోడ్డు పక్కన ఆపి ఉన్న ట్రాక్టర్‌ను అదుపు తప్పి ద్విచక్రవాహనదారుడు ఢీకొనడంతో పలువురికి గాయాలైన సంఘటన మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి జరిగింది. గ్రామస్తులు కథనం ప్రకారం...మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లే రోడ్డులో పెద్దమ్మ గుడి దగ్గర ఓ వ్యవసాయ బావి వద్ద పొలంలో ట్రాక్టర్‌తో దున్ని కేజీవీల్స్ ఇప్పడానికి ఆ ట్రాక్టర్‌ను ఇంజన్‌ను రోడ్డు పక్కకు నిలిపివేశాడు. కేజీవీల్స్‌ను రాకేష్, బావండ్లపల్లి రవిలు ఇద్దరూ కలిసి విప్పుతున్నారు. అదే సమయంలో మండలంలోని నక్కవానిగూడేనికి చెందిన బొట్టు నరేష్ తన ద్విచక్రవాహనంపై మండల కేంద్రం నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో బైక్ అదుపు తప్పి కేజీవీల్స్ విప్పుతున్న రాకేష్, రవిలను ఢీకొనగా ముగ్గురికి గాయాలయ్యాయి. గమనించిన వారు చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించారు. రాకేష్, రవిలకు తీవ్రంగా గాయాలు కాగా వైద్యుల సూచనల మేరకు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. ఘటనా స్థలం వద్దకు పోలీసులు వెళ్లి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు ‘చలో కలెక్టరేట్’

బచ్చన్నపేట : మండలంలోని గోపాల్‌నగర్ శివారులోని 174 సర్వేనంబర్ పరిధిలోని భూ పోరాటంలో పాల్గొన్న ఇళ్లు లేని నిరుపేదలు అందరూ శనివారం చలో కలెక్టరేట్‌కు హాజరు కావాలని సీపీఎం మండల కార్యదర్శి బెల్లంకొండ వెంకటేష్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆ యన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఈ భూమి విషయమై మాట్లాడడానికి భూపోరా టంలో పాల్గొన్న వారందరికి సమయం ఇచ్చారన్నారు.